క్లుప్తంగా

చేనేత పారిశ్రామిక సహకార సంఘం వార్షికోత్సవం



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి ఉపేందర్

హుజూరాబాద్: పట్టణంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం వార్షికోత్సవ మహాసభ సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఏలిగేటి ఉపేందర్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సంఘం సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. 2024 వార్షిక సంవత్సరం ఉత్పత్తి, విక్రయాలు చదివి వినిపించగా సంఘం సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వేముల యాదగిరి, గుండేటి మహాదేవ్, మంచికట్ల వెంకటయ్య, మండల సత్యనారాయణ, కుడికాల ప్రభాకర్, మంచికట్ల సుమలత, వాణి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం



కరాటే బెల్టులతో విద్యార్థులు

చొప్పదండి: మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కరాటే బెల్టులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. ఆత్మరక్షణ, శారీరక సౌష్టవం, క్రమ శిక్షణ కరాటేతో అలవడుతుందన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రానికి పంపాలి

చొప్పదండి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తల్లిదండ్రులు మండల కేంద్రంలోని భవిత కేంద్రానికి పంపించాలని ఎంఈవో శ్రీనివాస్ దీక్షిత్ కోరారు. ఈమేరకు మండలంలోని మానవ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేకావసరాల పిల్లలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని, వారి భవిష్యత్ అంధకారం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పెద్ది శ్రీనివాస్, కట్టెకోల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుంటాం



గ్రామసభలో అధికారులు, ప్రజలు

శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణంతో పట్టా భూమి కోల్పోతామని ఓ రైతు పనులను అడ్డుకోవడంతో సర్వేయర్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ భాస్కర్ స్పష్టం చేశారు. గ్రామంలో సీసీరోడ్డు పనులు చివరదశకు చేరుకోగా చంద్రయ్య రైతు కుటుంబం అభ్యంతరం చెప్పడంతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. పట్టాభూమి కోల్పోతామని, పరిహారం ఇవ్వాలనడంతో పూర్తి స్థాయి సర్వే చేసి ప్రభుత్వ భూమి ఆక్రమించినట్టయితే స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ తేల్చి చెప్పారు. వివాదం పరిష్కారం కాకపోవడంతో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ గ్రామంలో మరో వీధిలో సీసీరోడ్డు వేయించారు.

వైద్య శిబిరానికి స్పందన



కమిషనర్‌కు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శ్రీరామ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఉద్యోగులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. కార్మికులు, ప్రజలకు పరీక్షలు చేసిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ ఆస్పత్రి యాజమాన్యం నంబి భరణి కుమార్, ముష్కె శ్రీనివాస్, పూరి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

విదేశీ విద్యకు రూ.వంద కోట్లు

హుజూరాబాద్: నిరుపేద బ్రాహ్మణ కుటుంబాల్లోని ప్రతిభ గల విద్యార్థుల కోసం విదేశీ విద్య కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు రూ.వంద కోట్ల నిధులు కేటాయించారు. ఈసందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాల్‌రావు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీల ఎదుట ఆశావర్కర్ల నిరసన



గంగాధర: డాక్టర్ శ్వేతకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



చిగురుమామిడి: ఇందుర్తిలో ప్లకార్డులతో నిరసన

చిగురుమామిడి: మండలంలోని ఆశా కార్యకర్తలు చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందుర్తి పల్లెదవాఖానా ఎదుట ప్లకార్డులతో శుక్రవారం నిరసన తెలిపారు. నెలకు రూ.26 వేల వేతనం, భద్రత కల్పించాలని కోరారు. వేతనంతో కూడిన ప్రసూతి, ఇరవై రోజుల క్యాజువల్ సెలవులు ప్రకటించాలన్నారు. అనంతరం చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. నిరసనలో జిల్లా ఆశా కార్యకర్తల యూనియన్ ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత, నాయకులు శారద, లక్ష్మి, పద్మ, లత, రజిత, సుజాత, స్వప్న, ప్రియాంక, శంకరమ్మ, భాగ్యలక్ష్మి, రజియాబేగం, రాజమణి పలువురు పాల్గొన్నారు.

గంగాధర: న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఆశవర్కర్లు శుక్రవారం గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, పెన్షన్ ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్లను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఒకే పని విధానం అమలు చేయాలని, సీనియారిటీ ప్రకారం ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని, వేతనంతో కూడిన ప్రసూతి మెడికల్ సెలువులు ఇవ్వాలని డాక్టర్ శ్వేతకు వినతిపత్రం అందజేశారు. నిరసనలో చిలుముల శంకరమ్మ, గడ్డం పర్మిత, సుమలత, ప్రమీల, మమత, సుస్మా, స్వర్ణ, అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



సీమంతం చేస్తున్న అధికారులు

మానకొండూర్‌రూరల్: పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని డీడబ్ల్యూవో సబిత అన్నారు. మండలంలోని వేగురుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన శుక్రవారం సభకు హాజరై మాట్లాడారు. బాలికలపై వివక్ష చూపొద్దని, లింగనిర్ధారణ పరీక్షలు చేయొద్దన్నారు. జిల్లా వైద్యాధికారి వెంకటరమణ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని, బాల్యవివాహాలతో అనారోగ్య సమస్యలకు గురవుతారని స్పష్టం చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ శ్రీధర్, ఎంపీడీవో వరలక్ష్మి, సూపర్‌వైజర్ రమాదేవి, మమత, మంజుల, కె.అరుణ, పద్మజ, స్వరూప, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు

హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్. శ్రీనివాస్‌జి



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

హుజూరాబాద్: క్రమశిక్షణతో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్.శ్రీనివాస్‌జీ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగపురంలో కిట్స్‌ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల క్రీడా సాహిత్య, సాంస్కృతిక ఉత్సవ ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ, కళాశాల చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతారావు మాట్లాడారు. కంప్యూటర్, ఇంటర్నెట్, మొబైల్ సాధనాలతో విద్యార్థులు విలువైన సమయం కోల్పోతున్నారని, జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్స్, టెక్నికల్ స్కిల్స్ నేర్చుకొని సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శంకర్, ప్రిన్సిపల్ ఈశ్వరయ్య, హుజూరాబాద్ సీఐ తిరుమల్‌గౌడ్, అధ్యాపక సమన్వయకర్తలు సునీత, రాజు, విద్యార్థి సమన్వయకర్త అభిరామ్, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు

రామడుగు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులు, అధికారులు, పాలకవర్గం పరస్పర సహకారంతో సంఘం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని రామడుగు సహకార సంఘం చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం అందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో సంఘం చేపట్టిన అంశాలను సీఈవో మల్లేశం చదివి వినిపించారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఆయా నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



చిగురుమామిడి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ చిగురుమామిడి మండలశాఖ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని శుక్రవారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ముందు నినాదాలు చేశారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కాత మల్లయ్య, అధ్యక్షుడు దొబ్బల బాబు, ఉపాధ్యక్షుడు బోయిని శ్రీనివాస్, సీనియర్ నాయకులు బోయిని ఆదిమల్లయ్య, అధికార ప్రతినిధి కాత తిరుపతి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు జిల్లాల రమేశ్, పైస తిరుపతి, మంకాలి కొంరయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భాగవత సప్తాహ మహోత్సవం



మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో గోపాల మురళీకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో భాగవత సప్తాహ మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అభినవశుఖ, పురాణ వాచస్పతి శ్రీమాన్ శ్రీనంబి వేణుగోపాలచారి ప్రవచనామృతం కార్యక్రమం సాగింది. శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు ప్రవచనం సాగుతుందని వైదిక నిర్వాహకులు జ్యోతిష్య వాస్తు పండితులు నమిలకొండ రమణాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగపెల్లి సావిత్రమ్మ రమేశ్‌రావు రేణుక, రాంగోపాల్‌రావువర్షా దంపతులు గ్రామ పెద్దలు, పండితులు రామకృష్ణమాచార్యులు, వినయ్ స్వామి, బ్రహ్మశ్రీ రామశర్మ, రఘురామాచార్యులు పండితులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త జనాబృంధం, భాగవత కథా మృతాన్ని శ్రవణం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధ్యతలు స్వీకరణ



సురేందర్ | వంశీకృష్ణ | రాజు

గంగాధర: గంగాధర ఎస్సైగా వంశీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నరేందర్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లగా వీఆర్‌లో ఉన్న వంశీకృష్ణ బదిలీపై వచ్చారు. పేకాట, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

చొప్పదండి: చొప్పదండి ఎస్‌ఐగా మామిడాల నిరంజన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన గొల్లపల్లి అనూష బదిలీపై వెళ్లారు. ఎస్ఐకి స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

రామడుగు: రామడుగు ఎస్ఐగా కోదాటి రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శేఖర్ బదిలీ కావడంతో బదిలీపై వచ్చారు.మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కార్యవర్గం

చిగురుమామిడి: చిగురుమామిడి మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాళ్లపల్లి భాస్కర్, ప్రధానకార్యదర్శిగా తాళ్లపల్లి సుజాత, ఉపాధ్యక్షుడిగా బోయిని చంద్రయ్య, కోశాధికారిగా రావుల మనోహర్, ప్రచార కార్యదర్శిగా జువ్వాజి రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఎన్నికల్లో ఆయా గ్రామాల రేషన్‌డీలర్లు దేశిని జ్యోతి, మోరె మనెమ్మ, గాజుల కమల, పీచు అరుణ, ఒంటెల రజిత, గట్టు మధు, ఇనుగొండ పాపయ్య, హరీశ్, దోనపాటి రజిత, అందె బుచ్చిరాజమ్మ, కాటం నర్సయ్య పాల్గొన్నారు.

రాయితీపై పనిముట్లు

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజులునాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఎస్ఎంఏఎం పథకం కింద మహిళా రైతులకు మాత్రమే బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, రోటోవేటర్లు, కేజీవీల్స్ అందుబాటులో ఉన్నాయని, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ జిరాక్స్‌లు, దరఖాస్తు ఫారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో అందించాలని కోరారు. మహిళా రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



మానకొండూర్: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామంలో శుక్రవారం సీసీరోడ్డు పనులను గ్రామ స్పెషల్ ఆఫీసర్ రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అశోక్, బూత్ అధ్యక్షుడు మీస రమణయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

‘రసమయి’ వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అల్గునూర్ చౌరస్తాలో నాయకులు నిరసన తెలిపారు. యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అట్ల అనిల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కవ్వంపల్లిపై తప్పుడు ప్రచారం చేస్తే మానకొండూర్‌లో తిరగకుండా చేస్తామని హెచ్చరించారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండూ ఎల్‌వోసీలు ఎక్కడ ఇస్తారో తెలియకపోవడం సిగ్గుచేటన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందలాది ఎల్వోసీలు, వేలాది సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చినట్లు తెలిపారు. నిరసనలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురేష్, అజయ్, మణికంఠ, సందీప్, రాపోలు నవీన్ అసెంబ్లీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌శివారులో విద్యుత్ మోటార్లు చోరీ చేసిన ముగ్గురు దొంగలను పట్టుకున్నామని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. శుక్రవారం రాత్రి కేశవపట్నం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కేశవపట్నంకు చెందిన ముగ్గురితో పాటు మరో వ్యక్తి జల్సాలకు అలవాటు పడి రాత్రివేళ ఉపకాలువకు బిగించిన వ్యవసాయ మోటార్లను దొంగిలించారు. చోరీ చేసిన మోటార్లను విక్రయించేందుకు తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి ఆరు మోటార్లు, దొంగతనానికి వినియోగిస్తున్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, ముగ్గురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని ఏసీపీ వివరించారు. సమావేశంలో హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకటి, ఎస్సై రవి ఉన్నారు.



వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామ శివారులోని ఊర చెరువు వద్ద ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శివ, పంచాయతీ కార్యదర్శి సెల్ నంబర్: 8074590258

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

హుజూరాబాద్: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్–2025లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య అధ్యక్షతన పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నూతనంగా కొనుగోలు చేసిన ఆటో, చెత్తాడబ్బాలను ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా నుంచి సూపర్‌బజార్ మీదుగా ర్యాలీగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వరకు చేరుకున్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్, మహిళా సంఘాలు, విద్యార్థులు, పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గుర్చి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ సాంబరాజు, మేనేజర్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

జమ్మికుంట: సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న క్రమంలో మూఢ నమ్మకాలను వీడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు అన్నారు. మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఇటీవల వరుసగా ఒకరి తర్వాత మరొకరు మృతిచెందారు. ఈనేపథ్యంలో కీడు సోకిందని గ్రామస్తులు ఈ నెల 13వ తేదీన ఊరి బయటకు వనభోజనాలకు వెళ్లిన విషయం తెలిసిందే. కలెక్టర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. చేతబడి వంటివి నమ్మొద్దంటూ ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. అనారోగ్యానికి గురైతే అందుబాటులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేశ్, జమ్మికుంట టౌన్ సీఐ వరంగంటి రవి, డాక్టర్లు రాజేశ్, హిమబిందు, కార్తీక్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్‌గౌడ్, మోహన్ రెడ్డి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, సదానందం, పంచాయతీ కార్యదర్శి విష్ణు, మనోవికాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంటాల బుచ్చయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ మేళా



వీణవంక: మండలంలోని అంకూస్‌పల్లి, రెడ్డిపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించడంతోపాటు పిల్లల కోసం అనేక కార్యక్రమమాలు చేపడుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు సరిత, వినోద అన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, అన్నివసతులు కేంద్రాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా సెంటర్ల ఆయాలు, బాలింతలు, గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వీణవంక: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో శుక్రవారం మాట్లాడారు. ఆరు నెలలుగా మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 25న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నామని అధిక సంఖ్యలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిట్టపల్లి సదానందం, భూలక్ష్మి, రాజయ్య, కొంరయ్య ఉన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు



రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

సాక్షినెట్‌వర్క్: హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రతి సెంటర్‌లో సిటింగ్ స్కాడ్ ఏర్పాటుతోపాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విజయవంతం చేయండి

వీణవంక: కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌హాల్‌లో ఈ నెల 23న జరిగే జిల్లా స్థాయి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మాట్లాడుతూ... అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

మొసలి కన్నీరు

చొప్పదండి: అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయలేని మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ విమర్శించారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో విఫలమయ్యారని ఇప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, 26 వేల ఎకరాలకు సాగు నీరందించే పనులు చేపట్టిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను విమర్శించడం సరికాదన్నారు.